ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రముఖ సినీనటుడు పవన్‌కల్యాణ్‌ను తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన పలువురు నిర్మాతలు సోమవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. సినీపరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వారు డిప్యూటీ సీఎం పవన్‌తో చర్చించారు. ఈ సమావేశంలో ఏపీ సినిమాటోగ్రఫీ మినిస్టర్ కందుల దుర్గేశ్‌తోపాటు నిర్మాతలు అల్లు అరవింద్, సి.అశ్వనీదత్, దిల్‌రాజు, ఏ.ఎం.రత్నం, ఎస్.రాధాకృష్ణ, భోగవల్లి ప్రసాద్, డీవీవీ దానయ్య, యార్లగడ్డ సుప్రియ, ఎన్వీప్రసాద్, బన్నీ వాస్, నవీన్ ఎర్నేని, సూర్యదేవర నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్ తదితరులు ఉన్నారు.

తానే ఒక యుద్ధం

సీనియర్ నటి విజయశాంతి పోలీస్ పాత్రలకు పెట్టింది పేరు. కర్తవ్యం, పోలీస్‌లాకప్, శత్రువు, సూర్య ఐపీఎస్.. ఇలా పలు చిత్రాల్లో ఆమె పోలీస్‌గా మెప్పించారు. సుదీర్ఘ విరామం తర్వాత మరోమారు పోలీస్ అధికారి పాత్ర ద్వారా ప్రేక్షకులను ఆమె పలకరించబోతున్నారు. వివరాల్లోకి వెళితే..కల్యాణ్‌రామ్ హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కెతున్నది. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాలో విజయశాంతి వైజయంతీ ఐపీఎస్ పాత్రను పోషిస్తున్నది. సోమవారం ఆమె జన్మదినం సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'వైజయంతీ ఐపీఎస్.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకికే ధైర్యం వస్తుంది. వేసుకుంటే యూనిఫాంకే పౌరుషం వస్తుంది..తానే ఒక యుద్ధం, నేను తన సైన్యం' అంటూ కల్యాణ్‌రామ్ వాయిస్ ఓవర్‌తో ఆమె పాత్రను పరిచయం చేశారు. సోహెల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాతలు: అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, రచన-దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి.

నిజంగా అంతధైర్యం చేసిందా?

సీతారామం, హాయ్ నాన్న విజయాలతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైంది మృణాళ్ ఠాకూర్. ప్రస్తుతం ఈ అందాలభామ 'పూజా మేరీ జాన్' అనే బాలీవుడ్ సినిమా మాత్రమే చేస్తున్నది. ఇంకొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. తెలుగులో మాత్రం ఏ సినిమాకీ ఓకే చెప్పలేదు. అయితే.. ప్రభాస్ 'కల్కి 2898ఏడి'లో మృణాల్ ఓ ప్రత్యేకమైన పాత్ర పోషించినట్టు తాజా సమాచారం. ఇందులో భైరవగా ప్రభాస్ నటించిన విషయం తెలిసిందే. భైరవ తల్లి పాత్రను ఇందులో మృణాళ్ పోషించిందట. భైరవ చిన్నప్పటి సన్నివేశాల్లో మృణాళ్ పాత్ర కనిపిస్తుందని తెలుస్తున్నది. హీరోయిన్‌గా పీక్స్‌లో ఉండి కూడా ఇలా ప్రభాస్‌కి తల్లిగా నటించడం నిజంగా గ్రేట్ అని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే.. ఈ విషయాన్ని 'కల్కి' టీమ్ అధికారికంగా ప్రకటించలేదు. ప్రచార చిత్రాల్లో కూడా ఎక్కడా మృణాళ్ జాడ లేదు. అయితే.. సినిమాలో మాత్రం ఆమె పాత్ర చాలా కీలకంగా ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. ఇందులో నిజం ఎంతో తెలియాలంటే.. ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

సెన్సేషనల్ కాంబోకు రంగం సిద్ధం?

తమిళ అగ్ర దర్శకుడు అట్లీ ఓ సంచలన కాంబినేషన్‌ను తెరపై తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ముంబయి సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్, బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రాన్ని తెరకెక్కించడానికి అట్లీ ప్రయత్నాల్ని ముమ్మరం చేశారని సమాచారం. 'జవాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాడు దర్శకుడు అట్లీ. షారుక్‌ఖాన్ నటించిన ఈ చిత్రం వెయ్యి కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. అట్లీ తన తదుపరి చిత్రాన్ని సల్మాన్‌ఖాన్‌తో చేయబోతున్నాడు. సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రంలో రజనీకాంత్ కూడా భాగం కానున్నారని, ఇద్దరు సూపర్‌స్టార్స్‌ను దృష్టిలో పెట్టుకొని అట్లీ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే నెలలో రజనీకాంత్, సల్మాన్‌ఖాన్‌తో కలిసి అట్లీ స్క్రిప్ట్‌ను వివరించబోతున్నారని అంటున్నారు. ఒకవేళ ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చితే, బాక్సాఫీస్ వద్ద సంచనాలు క్రియేటవ్వడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం సల్మాన్‌ఖాన్ 'సికందర్' చిత్రంలో నటిస్తున్నారు. మురుగదాస్ దర్శకుడు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన అనంతరం అట్లీ-సల్మాన్‌ఖాన్ కాంబో మూవీ పట్టాలెక్కనుంది.

కొత్త దర్శకుడితో నెక్ట్స్ మూవీ?

'రానా నాయుడు' వెబ్ సిరీస్ తర్వాత విరామం తీసుకున్నారు హీరో రానా. ఆయన తదుపరి సినిమా ఏంటి? అనే విషయంపై ఫిల్మ్‌వర్గాల్లో ప్రస్తుతం చర్చోపచర్చలు జరుగుతున్నాయి. తేజ దర్శకత్వంలో 'రాక్షస రాజు' సినిమా చేస్తున్నట్టు అప్పట్లో వార్తలొచ్చాయి. కానీ అది పట్టాలెక్కలేదు. అలాగే గుణశేఖర్ దర్శకత్వంలో 'హిరణ్యకశ్యప' అనే పౌరాణిక చిత్రం కూడా అనుకున్నారు. అది కూడా ప్రస్తుతం హోల్డ్‌లోనే ఉంది. మరి ఈ రెండిట్లో ముందు మోక్షం దేనికో! అని అందరూ ఎదురు చూస్తుంటే.. అందరి ఆలోచనలను తల్లకిందులు చేస్తూ.. ఓ కొత్త దర్శకుడి కథను రానా ఓకే చేశారట.. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ కూడా మొదలు కానున్నదట. ఆర్కా మీడియా వర్క్స్ నిర్మించనున్న ఈ సినిమాకు కథానాయికగా 'కేజీఎఫ్'ఫేం శ్రీనిధిని ఎంపిక చేసినట్టు సమాచారం. అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది.

రొమాంటిక్ డార్లింగ్

బ్లాక్‌బాస్టర్ 'హను-మాన్'ని అందించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నుంచి రానున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్'. ప్రియదర్శి, నభానటేశ్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి అశ్విన్‌రామ్ దర్శకుడు. జూలై 19న సినిమా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచారచిత్రాలకు మంచి స్పందన వస్తున్నది. నేటి జనరేషన్‌కి కనెక్టయ్యే కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులనూ అలరించేలా ఈ చిత్రాన్ని దర్శకుడు తెరకెక్కిస్తున్నారని, తమ సంస్థలో మరో బ్లాక్‌బాస్టర్‌గా ఈ సినిమా నిలుస్తుందని నిర్మాతలు నమ్మకం వెలిబుచ్చారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకి కెమెరా: నరేశ్ రామదురై, మాటలు: హేమంత్, సంగీతం: వివేక్ సాగర్.

నీ వేదనేంటి నివేదా..?

బొద్దుగా ముద్దుగా చూడముచ్చటగా ఉంటుంది కేరళకుట్టి నివేదా థామస్. తెలుగులో కూడా ఈ అందాలభామకు ఫ్యాన్ బేస్ ఎక్కువే. తారక్, నాని లాంటి స్టార్ హీరోలతో జతకట్టి విజయాలను అందుకున్నది నివేద. నటన, నాట్యం, గానం.. ఇలా బహుకళాప్రావీణ్యం నివేద థామస్ సొంతం. ప్రస్తుతమైతే ఈ మలయాళ మందారం చేతిలో సినిమాలేం లేవు. అయితే.. ఇన్‌స్టాలో మాత్రం ఎప్పుడూ బిజీబిజీగా ఉంటుంది నివేదా. తన సోదరునితో కలిసి రీల్స్ చేస్తూ ఎప్పటికప్పుడు అభిమానులతో ఇంటరాక్ట్ అవుతూ ఉంటుంది. అయితే.. రీసెంట్‌గా ఎక్స్(ట్విటర్)లో తను పెట్టిన పోస్ట్ ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాంశమైంది. 'కొంతకాలం గడిచింది.. కానీ.. చివరిగా!' అంటూ నర్మగర్భంగా పోస్ట్‌లో అక్షరాలను పొందుపరిచింది నివేద.. ఈ అక్షరాలకు అర్థమేంటి? ఎట్టకేలకు సినిమా చేస్తున్నాననా? లేక చివరి సినిమా చేస్తున్నాననా? లేక పెళ్లిపీటలెక్కుతున్నాననా? అర్థం కాక, నెటిజన్స్ జుత్తు పీక్కుంటున్నారు.

సందేశంతో 'పేకమేడలు'

వినోద్‌కిషన్, అనూపకృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం 'పేక మేడలు'. నీలగిరి మామిళ్ల దర్శకుడు. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై రాకేష్ వర్రే నిర్మిస్తున్నారు. జూలైలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని తొలిగీతం 'బూమ్ బూమ్ లచ్చన్న' ఇటీవల విడుదలైంది. స్మరణ్‌సాయి సంగీతాన్నందించిన ఈ గీతాన్ని మనో ఆలపించారు. భార్గవ్ కార్తీక్ రచించారు. ఆద్యంతం వినోదప్రధానంగా ఈ పాటను తెరకెక్కించారు. విభిన్నమైన కాన్సెప్ట్‌తో చక్కటి సందేశాన్ని మేళవించి ఈ చిత్రాన్ని రూపొందించామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: హరిచరణ్ కె, రచన, దర్శకత్వం: నీలగిరి మామిళ్ల.

బాయ్ బాయ్.. రాధాబాయ్..

రాజ్‌తరుణ్, మాల్వి మల్హోత్రా జంటగా రూపొందుతోన్న చిత్రం 'తిరగబడరసామీ'. ఎ.ఎస్.రవికుమార్‌చౌదరి దర్శకుడు. మల్కాపురం శివకుమార్ నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణంలో ఉంది. ప్రమోషన్‌లో భాగంగా ఇందులోని లిరికల్ సాంగ్‌ను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. ఈ సినిమాలో విభిన్నమైన పాత్ర పోషిస్తున్న మన్నారా చోప్రాపై చిత్రీకరించిన ఈ ప్రత్యేక గీతం యువతరాన్ని ఆకట్టుకునేలా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. 'బాయ్ బాయ్.. రాధాభాయ్.. చెప్తాంటే హాయ్ హాయ్.. అవుతాందే మనసంతా గాయ్ గాయ్..' అంటూ సాగే ఈ గీతాన్ని భోలే షావలి స్వయంగా రాసి, స్వరపరచగా, శ్రావణభార్గవి హైలీ ఎనర్జిటిక్‌గా ఆలపించారని, మన్నార్ చోప్రా మాస్ డాన్స్ మూమెంట్స్ విశేషంగా ఆకట్టుకుంటాయని మేకర్స్ తెలిపారు. మకరంద్ దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘుబాబు, అంకిత ఠాకూర్, పృథ్వి, ప్రగతి, రాజారవీంద్ర, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి కెమెరా: జవహర్‌రెడ్డి ఎం.ఎస్, నిర్మాణం: సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా.